శ్రద్ధగా జగనన్న గోరుముద్ద

- రోజుకో వంటకంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- వేరుశనగ చిక్కీతో పాటు ఉడికించిన గుడ్డు
- రోజు విడిచి రోజు రాగి జావ
- ఆహారం మోతాదును పెంచిన ప్రభుత్వం


మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

పెదపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా పేదలే. వారికి నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యంతో చదువుల్లో రాణిస్తారు. ఇందుకోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రవేశ పెట్టారు. ఆహారంలో పోషక విలువలు పెంచేందుకు వారంలో చిక్కితో పాటు ఉడికించిన గుడ్డు ఆహారంలో అందిస్తూ గోరుముద్ద మరింత రుచికరంగా చేశారు. ఈ ఏడాది నుంచి వారంలో మూడు రోజులు ఉదయం 9 గంటలకు రాగి జావ అందిస్తున్నారు. గుడ్డు సైజు, వడ్డించే ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. గతంలో వారంలో మూడుసార్లు మాత్రమే గుడ్డు సరఫరా చేస్తుండగా తాజాగా రోజూ సరఫరా చేస్తున్నారు. ఏ వారం అందించే గుడ్డుపై ఆ రంగులను ప్రభుత్వం ముద్రిస్తోంది. దీంతో విద్యార్థులకు తాజా గుడ్లు అందించేందుకు వీలుగా ఉంటుందని ఉపాధ్యాయుల వంట ఏజెన్సీ నిర్వాహకులు పేర్కొంటున్నారు.

మధ్యాహ్న భోజనంపై పెరిగిన పర్యవేక్షణ

గతంలో మధ్యాహ్న భోజనం పథకం అమలుపై ఎలాంటి పర్యవేక్షణ ఉండేది కాదు. తహసీల్దార్, ఎంపీడీఓ, ఆ పాఠశాల హెచ్ఎం మాత్రమే మధ్యాహ్న భోజనం కమిటీ సభ్యులుగా ఉండేవారు. ప్రస్తుతం జగనన్న గోరుముద్ద అమలుపై పర్యవేక్షణ, పథకం సమర్థవంతంగా అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు వారి విధుల్లో భాగంగా మండల కేంద్రాలకు, గ్రామాలకు వెళ్లినప్పుడు మధ్యాహ్న భోజనం నిర్వహణపై తనిఖీ చేయాలని ఆదేశాలు జారీచేసింది. ప్రజా ప్రతినిధులు ప్రధానోపాధ్యాయులు పీఎంపీ కమిటీలు, గ్రామ, వార్డు సచివాలయ అధికారులు పర్యవేక్షణ కమిటీ బాధ్యతలు అప్పగించారు. దీంతో ప్రభుత్వ పాఠశాల్లో చదివే పేద విద్యార్థులకు జగనన్న గోరుముద్ద నాణ్యతగా., పౌష్టికంగా అందుతోంది.

పెరిగిన ధరలకు అనుగుణంగా

నిత్యావసర ధరలు పెరగడంతో వంట ఏజెన్సీ నిర్వాహకులు ఇబ్బంది పడేవారు. విద్యార్థులకు మంచి ఆహారం అందించాలనే ఉద్దేశంతో వంటకు అయ్యే ఖర్చును ప్రభుత్వం పెంచింది. ఇది వరకు మధ్యాహ్న భోజనం ఖర్చు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.4.97 ఇస్తుండగా తాజాగా రూ.5.88కు పెంచారు. ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గతంలో రూ.7.45 ఉండగా ఇటీవల రూ.8.57కు పెంచారు. దీంతో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనపర్తి నియోజకవర్గంలో..

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, పెదపూడి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో సుమారు 179 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వాటిలో సుమారు మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వారిలో మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు.

మెనూ ఇలా..

సోమవారం: పులావు/హాట్ పొంగల్, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కి
మంగళవారం: ఉదయం రాగిజావ, నిమ్మకాయ పులిహోర, పచ్చడి, గుడ్డు
బుధవారం: కూరగాయల అన్నం, ఉడికించిన గుడ్డు, చిక్కి
గురువారం: ఉదయం రాగిజావ, సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు
శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కి
శనివారం: ఉదయం రాగిజావ, ఆకుకూర, అన్నం పప్పుచారు, తీపి పొంగల్

నాణ్యమైన భోజనం వడ్డన



మా పాఠశాలలో రోజూ నాణ్యమైన భోజనం వడ్డిస్తారు. నేను కడుపు నిండా తింటున్నాను. వారంలో ఒక్కోరోజు ఒకో రకమైన భోజనం వడ్డిస్తారు. ఉదయం పాఠశాలలకు రాగానే రాగి జావ ఇస్తున్నారు. అన్నంలో ఉడికించిన గుడ్డు ఇస్తారు, భోజనం అనంతరం చిక్కీ ఇస్తున్నారు.

– వై.సరస్వతి, 9వ తరగతి, గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెదపూడి

రుచిగా ఉంటోంది



నేను రోజూ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తాను. రోజుకో రకం భోజనం పెడుతున్నారు. చాలా రుచిగా ఉంటోంది. ఇంట్లో కన్నా పాఠశాలలో భోజనమే చాలా బాగుంది. పోషకాలతో కూడిన రాగిజావను ఇస్తున్నారు. మాకు ఇష్టమైన కోడిగుడ్డును సైతం అందిస్తున్నారు. నాతోపాటు స్నేహితులందరూ ఇష్టంగా తింటున్నాం.

– కె.మనోహర్, 9వ తరగతి, గాంధీమెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెదపూడి

క్లుప్తంగా

ఉపాధి హామీతో గ్రామాల్లో మౌలిక వసతులు


గ్రామసభలో మాట్లాడుతున్న అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు

రంగంపేట: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం దోహదపడుతుందని అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం దొడ్డిగుంట గ్రామ సచివాలయంలో సర్పంచ్ కారి సంజీవరావు అధ్యక్షతన జరిగిన ఉపాధి గ్రామసభకు ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం ఉపాధిహామీ పథకం అమలులో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులపై గ్రామసభలో చర్చించారు. పథకం ఏపీఓ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి హామీ ఆవశ్యకతను, గత సంవత్సరకాలంలో చేపట్టిన పనుల వివరాలను తెలియజేశారు. చెరువులు, కాలువల్లో పూడికతీత పనులు, పుంతరోడ్లు, సోక్ పిట్స్, రింగ్‌ట్రెంచ్‌లు, హార్టికల్చర్ తదితర పనులతో పాటు కొత్తగా 55 పనులను గుర్తించామని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి మణికుమార్, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం


సంజీవయ్యనగర్‌లో కాలిపోతున్న తాటాకిల్లు

గోకవరం: స్థానిక సంజీవయ్యనగర్‌లో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. సంజీవయ్యనగర్‌కు చెందిన బాతు ధర్మరాజు ఇంటి నుంచి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అతని కోడలు కుమారి ఇంట్లో ఉండగా మంటలను గుర్తించి బయటకు పరుగులు తీసింది. విషయం గుర్తించిన స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఇంట్లో సామగ్రి మొత్తం కాలిపోయింది. త్వరలో ఇంటి నిర్మాణం చేపట్టడానికి రూ.50 వేలు అప్పు చేసి ఇంట్లో ఉంచానని, ప్రమాదంలో ఈ నగదు కాలిపోయిందని బాధితుడు వాపోయారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు బాధితుల నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం


శివరామకృష్ణ మాస్టారు దంపతులను సత్కరిస్తున్న అరుణ

రంగంపేట: పాఠశాల విద్యా ప్రమాణాలు పెంచడంలో మునుకుట్ల శివరామకృష్ణ మాష్టారు కృషి అభినందనీయమని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గరిమెళ్ళ అరుణ అన్నారు. శుక్రవారం చంద్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు శివరామకృష్ణ మాష్టారుకు స్వర్గీయ గరిమెళ్ళ జగన్నాథశాస్త్రి, సుబ్బలక్ష్మి స్మారక ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రదానం చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు గంటా రమణబాబు, పూర్వపు హెచ్ఎం ఫణికుమార్, ఉపాధ్యాయులు శివరామకృష్ణ దంపతులను సత్కరించి జ్ఞాపికలు అందించారు. విద్యా కమిటీ చైర్మన్ తూము గోవిందరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎండోమెంట్ ప్రైజ్‌గా రూ.లక్ష అందజేత


వీసీ పద్మరాజుకు చెక్కును అందజేస్తున్న పూర్వ విద్యార్థి తణుకులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ, ఎంఎస్ఎన్ క్యాంపస్, కాకినాడకు పూర్వ విద్యార్థి, శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరు తణుకులు రూ.లక్ష ఎండోమెంట్ ప్రైజ్‌గా అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును శుక్రవారం ఇక్కడ వీసీ ఆచార్య కె.పద్మరాజుకు అందజేశారు. ఈ మొత్తం నుంచి వచ్చే వడ్డీని కాకినాడ క్యాంపస్‌లో ఎంబీఏ ఫస్టియర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి ఏటా ప్రోత్సాహక బహుమతిగా అందజేస్తామని వీసీ తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ ఐ.దోసగిరిరావు, కాకినాడ క్యాంపస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.ప్రశాంతిశ్రీ, డాక్టర్ ఎం.కమల కుమారి, శ్రీరామ్ పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీలో అభిరామ్‌కు వెండి పతకం


అభిరామ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: కేరళలోని అలెప్పీలో మూడురోజులు జరిగిన జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ వర్క్‌షాప్‌లో మండలంలోని కొత్త తుంగపాడుకు చెందిన ఫొటోగ్రాఫర్ అభిరామ్‌కు వెండి పతకం లభించింది. ఎమ్మెల్యే, వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా వద్ద ఆయన ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో అభిరామ్‌ను ఎమ్మెల్యే రాజా అభినందించారు.

నేటి నుంచి ఫుట్‌బాల్ పోటీలు

రాజానగరం: దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో మూడురోజులు జరిగే సీబీఎస్ఈ సౌత్‌జోన్ (బాలికల) ఫుట్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలలోని 30 సీబీఎస్ఈ స్కూళ్ల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు హాజరుకానున్నారని ఆ విద్యాసంస్థల కార్యదర్శి సీహెచ్ విజయ ప్రకాష్ తెలిపారు.

పరిశుభ్రతపై అవగాహన

బిక్కవోలు: కాపవరంలో డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కౌమార దశ బాలికలకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన శుక్రవారం కల్పించారు. యుక్త వయసు పిల్లలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో డాక్టర్ హేమమాలిని వివరించారు. ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దసరా సందడి

- శరన్నవరాత్రులకు గ్రామాల్లో సన్నాహాలు
- రేపటి నుంచి అమ్మవారి పూజలు ప్రారంభం

బిక్కవోలు: శరన్నవరాత్ర వేడుకలకు అనపర్తి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కనకదుర్గమ్మ ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో అమ్మవారిని నిలిపేందుకు పందిళ్లు వేస్తున్నారు. ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు.

సిద్ధమవుతున్న చలువ పందిళ్లు

అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో ఊరూరా ఉత్సవ కమిటీలు పనుల్లో తలమునకలయ్యాయి. ఇప్పటికే రాట ముహూర్తాలను నిర్వహించారు. అనపర్తి, రామవరం, కొప్పవరం, పెదపర్తి, మహేంద్రవాడ, బిక్కవోలు, బలభద్రపురం, తొస్సిపూడి, కొమరిపాలెం, పందలపాక, కొంకుదురు, ఊలపల్లి, పెదపూడి. పెద్దాడ, గొల్లల మామిడాడ, రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి, దొంతమూరు తదితర గ్రామాలలో శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తారు. ప్రతి గ్రామంలోని ముఖ్య కూడళ్లలో ప్రత్యేక మంటపాలు ఏర్పాటు చేసి, దుర్గాదేవి విగ్రహాలను ప్రత్యేక వాహనాలపై గ్రామాలకు తీసుకువచ్చారు. ఒక్కొక్కరోజు అమ్మవారిని ప్రత్యేక అవతారాల్లో అలంకరణ చేసి కుంకుమతో పూజలు చేస్తారు.

దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


దసరా ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: చక్రద్వారబంధంలోని దేవిచౌక్ వద్ద ఈ నెల 15 నుంచి 27 వరకూ నిర్వహించే దసర ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా శుక్రవారం ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో రాజమహేంద్రవరంలోని ఆయన నివాసం వద్ద పోస్టర్‌తో పాటు కరపత్రాలను కూడా ఆవిష్కరించి, అభినందనలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు నాగవరపు త్రిమూర్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు నల్లమిల్లి వీరభద్రరావు, మార్గాని శ్రీను, అయ్యల సత్యనారాయణ, పి.వెంకన్నబాబు, పిల్లా శ్రీను పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులకు రాట ముహూర్తం


కొమరిపాలెంలో రాట ముహూర్తం చేస్తున్న కమిటీ సభ్యులు

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం గ్రామంలోని దోసాలమ్మ తల్లి ఆలయం వద్ద నవరాత్ర ఉత్సవాలకు శుక్రవారం రాట మంచి చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 24 వరకు దేవీ నవరాత్రులు జరుగుతాయన్నారు.

ప్రజల చెంతకే పారదర్శక పాలన

- కలెక్టర్ మాధవీలత
- కొప్పవరంలో రూ.4.50 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: పరిపాలన సౌలభ్యం, ప్రభుత్వ సేవలు పూర్తి పారదర్శకంగా, అవినీతికి తావులేకుండా ప్రజల ముంగిటకు చేర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. మండలంలోని కొప్పవరంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవన సముదాయాలు, అనపర్తి–తొస్సిపూడి బీటీ రహదారులను ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలతో కలిసి కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ప్రజలకు సత్వరంగా అందించేందుకు, ప్రజ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని అన్నారు. ప్రజలకు స్వచ్ఛ పాలన అందించేందుకు వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రభుత్వం సమూల మార్పులు తీసుకువచ్చిందని, సచివాలయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని ఆదేశించారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నిపుణులైన వైద్యులు గ్రామాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాల్లో పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. అంతకుముందుగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ గ్రామాలు సుభిక్షంగా ఉన్నపుడే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని, దీనికి అనుగుణంగా గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని అన్నారు. ఎమ్మెల్సీ శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, రాష్ట్ర మారిటైం బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డిలు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా సీఎం జగన్ గ్రామ స్వరాజ్యానికి శ్రీకారం చుట్టారన్నారు. సర్పంచ్ కర్రి బుల్లిమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య అతిథులను సత్కరించారు. ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, రాష్ట్ర భూదాన్ యజ్ఞ బోర్డ్ చైర్మన్ తాడి భాస్కరరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరాహార దీక్ష

అనపర్తి: న్యాయవాదుల సంక్షేమ నిధికి సంబంధించి అని పిటీషన్లపై రూ.20 వెల్ఫేర్ స్టాంప్‌లను అంటించాలన్న రాష్ట్ర బార్ కౌన్సిల్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అనపర్తి బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించి నిరాహార దీక్ష చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పినిపే వెంకటరామ కృష్ణ మాట్లాడుతూ బార్ అసోసియేషన్లను సంప్రదించకుండా నిర్ణయం తీసుకోవడాన్ని తప్పుబట్టారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఆర్‌వీజీ పట్నాయక్, రామచంద్రపురం బార్ అసోసియేషన్ కార్యదర్శి వి.సాయిప్రసాద్ మాట్లాడారు.

సురక్షతో ప్రజారోగ్యం మెరుగు

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు


గంగంపాలెంలో ప్రజలకు ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజారోగ్యం మెరుగు పడుతోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని గంగంపాలెంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య శిబిరంలో ప్రజలకు అందుతున్న సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వైద్య సేవలందించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రజలంతా ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్ కుమార్, నాయకులు దొడ్డి నాగేశ్వరరావు, నరాలశెట్టి నర్సయ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

బిక్కవోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎంపీటీసీ సభ్యుడు బండారు శివ అన్నారు. శుక్రవారం మండలంలోని ఊలపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 561 మంది విద్యార్థులకు వైద్యసేవలను అందించారు. బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రాజీవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతలు ప్రసాద్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటింటి సర్వే


పురుషోత్తపట్నంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సీతానగరం: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం నిర్వహించే గ్రామాల్లో వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది ముమ్మరంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. సీతానగరం, రఘుదేవపురం–1, 3, వంగలపూడి, పురుషోత్తపట్నం, ఇనుగంటివారిపేట, కూనవరం, బొబ్బిల్లలంక, మిర్తిపాడు, నాగంపల్లి గ్రామాల్లో సురక్ష కార్యక్రమాలు జరపాల్సి ఉంది. ఈ గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి, ప్రజల ఆరోగ్య సమస్యలపై ఆరా తీస్తున్నారు. అవసరమైన వారికి రక్త, నీరుడు పరీక్షలు చేస్తున్నారు. ఆరోగ్య విస్తరణాధికారి వైఎస్ రాయుడు విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఇంటికి వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది వెళ్లి అవసరమైన వారికి ఇంటి వద్దే బీపీ, షుగర్, రక్తహీనత స్థాయి, మూత్ర పరీక్షలు, డెంగీ, మలేరియా తదితర పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వీరికి వైద్యశిబిరంలో నిపుణులైన వైద్యులతో వైద్యసేవలు అందిస్తారన్నారు.

పేదల ఆరోగ్యమే సీఎం లక్ష్యం


ఈలకొలనులో జరిగిన శిబిరంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

రంగంపేట: పేదలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రవేశపెట్టారని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. మండల పరిధిలోని ఈలకొలను గ్రామంలో సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ షమ్మీకుమార్, డాక్టర్ గంగాధర్, డాక్టర్ పి.ఉమాశంకర్, డాక్టర్ ఝాన్సీలక్ష్మి 616 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 23 మందిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం జీజీహెచ్, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు తరలించారు. జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైస్ ఎంపీపీ రాయుడు రాంబాబు, పీహెచ్‌సీ డాక్టర్ జి.రామ్‌భాస్కర్ పాల్గొన్నారు.

పేదలకు వరం

పెదపూడి: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం అని తహసీల్దార్ టి.సుభాష్ తెలిపారు. శహపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ శుభాష్ మాట్లాడారు. శిబిరంలో 546 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు చాండ్రాళ్ల పార్వతీ, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు వి. చిన వెంకటరమణ పాల్గొన్నారు.